తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శుక్రవారం
14 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 305
పేజీలు 8
వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## కాళేశ్వరం నుంచి యూనిటీ మాల్ వరకు సీబీఐ విచారణ జరపాలి

- ముఖ్యమంత్రి వెంటనే కేంద్రానికి లేఖ రాయాలి
- ప్రజల ఆస్తుల విక్రయానికి ప్రభుత్వాలకు హక్కు లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిపై సమగ్ర దర్యాప్తు కోరిన రఘునందన్ రావు



హైదరాబాద్, ఆగస్టు 13 కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై కేవలం మూడు బ్యారేజీలకే పరిమితం కాకుండా, ప్రాజెక్టు రూపకల్పన నుంచి నిధుల

మిగతా 2వ పేజిలో..

## అమరావతే ఆంధ్ర భవిష్యత్తు: చంద్రబాబు

- మూడు రాజధానులతో రాష్ట్రానికి నష్టం
- సీడ్ యాక్సెస్ రోడ్డుతో కొత్త అధ్యాయం
- రైతుల త్యాగాలతో నిలిచిన రాజధాని
- ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి




అమరావతి, ఆగస్టు 13 మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం రాష్ట్రాన్ని తీవ్ర నష్టానికి గురి చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, గత ఐదేళ్లలో రాజధాని

మిగతా 2వ పేజిలో..

## నిషేధిత భూముల హక్కుదారులకు సీఎం భరోసా

- కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన
- 22-ఏ భూముల సమస్యలకు బై నంబర్లతో పరిష్కారం
- కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం
- పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- సంక్షేమం, అభివృద్ధిలో కొత్త ప్రమాణాలు సృష్టిస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2వ పేజిలో..



## మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం : సీఎం

- ప్రతిభకు ప్రజా ప్రభుత్వం అండ
- తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి
- 782 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు, ఉద్యోగార్థులకు అభినందనలు
- నైపుణ్యాభివృద్ధితోనే యువత భవిష్యత్తు మారుతుందని స్పష్టం
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13 హిందూ, ముస్లింల మధ్య తనకు ఎలాంటి వ్యత్యాసం లేదని, ఇద్దరూ తనకు రెండు కళ్లలాంటి వారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో పాల్గొన్న ఆయన, వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రూప్--1, గ్రూప్--2, గ్రూప్--3, గ్రూప్--4 ఉద్యోగాల్లో ఎంపికైన వారితో పాటు నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 782 మంది మైనారిటీ విద్యార్థులు, అభ్యర్థులను అభినందించారు. చదువే జీవితాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన సాధనమని ముఖ్యమంత్రి అన్నారు. విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు క్రమశిక్షణతో అభ్యసించడంతో పాటు నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నైపుణ్యం ఉన్న యువతకు దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ విస్తృత

మిగతా 2వ పేజిలో..

# జంక్ ఫుడ్‌పై సుప్రీం హెచ్చరిక

- హెచ్చరిక లేబుళ్లపై కేంద్రానికి గడువు
- ప్రజారోగ్యమే ప్రధానమన్న ధర్మాసనం
- కార్పొరేట్ ఒత్తిడికి లొంగొద్దని వ్యాఖ్యలు
- రెండు వారాల్లో నిర్ణయం చెప్పాలని ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 13 అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు కలిగిన ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్ల అమలులో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కీలక అంశంలో నిర్ణయాలు ఆలస్యం కావడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ తమ తుది నిర్ణయాన్ని రెండు వారాల్లోగా వెల్లడించాలని ఆదేశించింది. నిర్ణయం తీసుకోకపోతే తామే తగిన చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార ఉత్పత్తుల ప్యాకెట్ల ముందు భాగంలో వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా హెచ్చరిక లేబుళ్లు ఉండాలనే డిమాండ్‌పై విచారణ జరిగింది. ముఖ్యంగా చిన్నారులు, యువత ఆరోగ్యంపై జంక్ ఫుడ్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించింది.

విచారణ సందర్భంగా తయారీ సంస్థలు తమ వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా ఇటువంటి లేబుళ్లను వ్యతిరేకించవచ్చని, అయితే వినియోగదారులకు ఉత్పత్తిలోని పదార్థాల గురించి తెలుసుకునే హక్కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము కొనుగోలు చేసే ఆహారంలో ఎంత ఉప్పు, చక్కెర, కొవ్వు ఉందో తెలుసుకోవడం ప్రజల ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందని వ్యాఖ్యానించింది. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని కోర్టు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ వాదనలు కూడా విచారణలో చర్చకు వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలను పూర్తిగా అమలు చేస్తే నమ్‌కీన్ వంటి భారతీయ సంప్రదాయ ఆహార పదార్థాలపై కూడా హెచ్చరిక గుర్తులు

మిగతా 2వ పేజిలో..

## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

- 119 నియోజకవర్గాల్లో 1.19 లక్షల పంపిణీ
- ఆగస్టు 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారతే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్, ఆగస్టు 13 బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలుగా ఉండగా, లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అందజేయనున్నట్లు చెప్పారు. అర్హులైన బీసీ మహిళల నుంచి ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, దివ్యాంగులు, కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా

మిగతా 2వ పేజిలో..

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏది?

- పథకాలు నిలిచిపోయే పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత
- పేదల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు..
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పలు ప్రశ్నలు..
- ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్




2వ పేజిలో..

## ముఖ్యమంత్రి పర్యటనకు "ములుగు ముస్తాబు "

- మేడారంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- రూ.16 వేల కోట్ల హ్యామ్ రోడ్ల పనులకు పైలాన్ ఆవిష్కరణ
- నూతన కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క

2వ పేజిలో..

## రైతు సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి

- నకిలీ డీఏపీ తయారీదారులపై కఠిన చర్యలకు ఆదేశాలు
- ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ
- మార్కెట్లలో ఆర్డీ వ్యవస్థ నిర్మూలనకు కఠిన చర్యలు



2వ పేజిలో..

# మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం : సీఎం

అవకాశాలు ఉన్నాయని, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో కూడా నిపుణుల అవసరం పెరుగుతోందని చెప్పారు. యువతను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ క్రమంలోనే ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేయడంతో పాటు పాలిటెక్నిక్ కళాశాలలను నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకువచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. చిన్న కుటుంబాల నుంచి ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయాలు ఇతర యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. నైపుణ్యంతో కూడిన విద్యే సమాజంలో స్థిరమైన అభివృద్ధికి మార్గమని చెప్పారు. మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. నాలుగు శాతం రిజర్వేషన్లను తొలగించే ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి విజయవంతం కాలేదని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలులో మైనారిటీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా అనేక కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉద్యోగ నియామకాల విషయంలో గతంలో ఏర్పడిన సమస్యలను అధిగమించి పారదర్శక వ్యవస్థను తీసుకువచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నిపుణులతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాతే నియామక ప్రక్రియ వేగవంతమైందన్నారు. పరీక్షలను అడ్డుకునేందుకు పలు ప్రయత్నాలు జరిగినప్పటికీ ప్రభుత్వం న్యాయపరంగా పోరాడి నియామకాలను పూర్తి చేసిందని వెల్లడించారు. అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఉద్యోగాలు సాధించిన వారు ప్రజలకు సేవ చేయడాన్ని తమ బాధ్యతగా భావించాలని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ఫహీం ఖురేషీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నిషేధిత భూముల హక్కుదారులకు సీఎం భరోసా

హైదరాబాద్, ఆగస్టు 13 : నిషేధిత జాబితా (22-ఎ)లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోర్టు వివాదాల్లో ఉన్న భూములను మాత్రమే పక్కనపెట్టి, మిగతా భూములను బై నంబర్లు కేటాయించడం ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్)కు గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో ప్రజల్లో ఉన్న సందేహాలను తొలగించే ప్రయత్నం చేసిన ముఖ్యమంత్రి, కొనుగోలు చేసిన హక్కుదారుల ఆస్తులు ఎక్కడికీ పోవని స్పష్టం చేశారు. గతంలో ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం వివాదంలో ఉన్నా మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఇప్పుడు కోర్టు వివాదాలు లేని భాగాలను గుర్తించి బై నంబర్లు కేటాయించడం ద్వారా హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

కూకట్‌పల్లి ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ముఖ్యమంత్రి సూచించారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, విద్యా సంస్థల ఏర్పాటు, పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాల్లో ఈ ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కూకట్‌పల్లి ప్రజలకు ప్రభుత్వం రుణపడి ఉందని, వారి అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, గత ప్రభుత్వ హయాంలో అమలైన ఏ సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయలేదని, వాటికి అదనంగా కొత్త కార్యక్రమాలను ప్రారంభించామని ముఖ్యమంత్రి తెలిపారు. 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు భారీ స్థాయిలో బ్యాంకు లింకేజీ వంటి పథకాలను ప్రస్తావించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని, వేలాది కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా సంఘాల కోసం వెయ్యి బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి, మహిళా బజార్ల ఏర్పాటు, స్వయం ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ, పట్టణ మహిళలకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం నగర పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో పేదలకు నాణ్యమైన గృహాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదలకు కేటాయించే ఇళ్లకు రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా రద్దు చేయాలని మంత్రులకు సూచించినట్లు వెల్లడించారు. నగరంలో నిరుపేదలు ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే వారికి గృహాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తెలంగాణను వికాస వైపు నడిపించేందుకు తాను నిరంతరం శ్రమిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

## అమరావతే ఆంధ్ర భవిష్యత్తు: చంద్రబాబు

అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో అమరావతికి మద్దతు తెలిపిన నాయకులే అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీశారని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాజధానిని వివాదాస్పదం చేయడం వల్ల రాష్ట్ర అభివృద్ధి గణనీయంగా వెనక్కి వెళ్లిందని అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు, ఒకప్పుడు అమరావతికి మరిన్ని ఎకరాలు అవసరమని చెప్పిన నాయకులే తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఈ విధానం వల్ల పెట్టుబడులు దూరమయ్యాయని, రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతిందని వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ కక్ష సాధింపుతో అమరావతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన భూముల విలువను తగ్గించేలా చర్యలు తీసుకోవడం బాధాకరమని అన్నారు.అమరావతి ప్రణాళికలను గతంలో 'గ్రాఫిక్స్'గా విమర్శించిన వారిపై కూడా చంద్రబాబు స్పందించారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి రూపొందించిన నమూనాలను అపహాస్యం చేసిన వారు ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి సమాధానం పొందాలని అన్నారు.

# బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణ కూడా అందజేస్తామని తెలిపారు. మొదటి దశలో 1.19 లక్షల మంది మహిళలకు ప్రయోజనం కల్పించనున్నామని, భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.మహిళల ఉపాధి అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, వివిధ స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి గుర్తుచేశారు. ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం ద్వారా మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 14న మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ, ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# రైతు సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి

హైదరాబాద్, ఆగస్టు 13 : రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, వస్త్ర శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో తన శాఖల పరిధిలోని వివిధ విభాగాలు, సంస్థల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించిన మంత్రి, రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విబ్ జి రామ్ జి పథకం కింద ఎకో పాండ్లు, వెదురు సాగు చేపట్టేందుకు పంచాయతీరాజ్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ధారించిన తొమ్మిది వరి రకాలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకునేలా రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందజేస్తున్న యంత్రాల పంపిణీపై మంత్రి ఆరా తీశారు. సబ్సిడీపై యంత్రాల పంపిణీలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులకు సేవలందించేందుకు అవసరమైన సిబ్బందిని భర్తీ చేసుకోవాలని, అవసరమైతే ఇతర శాఖల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రతి రూపాయిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఉద్యోగుల హాజరును పర్యవేక్షించే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అన్ని శాఖల్లో అమలు చేసి విధులకు ఆలస్యంగా హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. నర్సరీల్లో మిగిలిపోయిన మొక్కలను వెంటనే విక్రయించి, కొత్త మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు మొక్కలు అందుబాటులో లేవనే పరిస్థితి ఉండకూడదని, దరఖాస్తు చేసిన రెండు మూడు రోజుల్లోనే మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ మిల్లుల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా ట్రయల్ రన్స్ ప్రారంభించాలని, ప్రతి ఉమ్మడి జిల్లాకు కనీసం ఒక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఉండేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. నకిలీ డీఏపీ తయారీ, విక్రయాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి, ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వివరించారు. ఇందులో సంబంధం ఉన్న ఎవరినీ వదిలిపెట్టవద్దని మంత్రి ఆదేశించారు. నకిలీ ఎరువులను ఎవరెవరికి విక్రయించారనే పూర్తి వివరాలు సేకరించి, నష్టపోయిన రైతులకు సంబంధిత వ్యక్తుల నుంచే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మార్కెట్లలో కొనసాగుతున్న ఆర్‌డీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులతో రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డులు, మిర్చి కోల్డ్ స్టోరేజీలను తనిఖీ చేయించి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. ఆర్‌డీ వ్యవస్థ వల్ల రైతులు నష్టపోవడమే కాకుండా మార్కెట్ ఫీజుల ఆదాయానికీ గండిపడుతోందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. తెలంగాణ వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటే ఆ విత్తనాలను రాష్ట్ర నర్సరీల్లో అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు "ములుగు ముస్తాబు "



ములుగు, ఆగస్టు 13 రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని పరిశీలించేందుకు ఆమె జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని సందర్శించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. పైలాన్ నిర్మాణ పనుల్లో జాప్యానికి తావులేకుండా గుత్తేదారులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, వివిధ విభాగాలు, సమావేశ మందిరాలు, కార్యాలయ గదులను సందర్శించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, రహదారులు వంటి మౌలిక వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించే విధంగా సముదాయాన్ని సిద్ధం చేయాలని చెప్పారు. పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా మేడారం చేరుకుని సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని మంత్రి సీతక్క తెలిపారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఆగస్టు 31 వరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని వెల్లడించారు.మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

# కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్‌పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏది?

హైదరాబాద్, ఆగస్టు 13 (తరంగాలు ప్రతినిధి): కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించారు. పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కావాలనే రద్దయ్యే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు.

### లక్షలాది కుటుంబాల్లో ఆందోళన

కుమార్తెల వివాహాల కోసం పేద కుటుంబాలు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఆధారపడుతున్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు లక్షలాది ఆడబిడ్డల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలులో సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రశ్నలు

కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన అంశం కోర్టులో కొనసాగుతున్న సమయంలో సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎప్పుడైనా సమీక్ష సమావేశం నిర్వహించారా అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. నెల రోజులుగా న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపలేదని ఆరోపించారు.

### పూర్తి వివరాలు వెల్లడించాలి

ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించి ఉంటే వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు. పథకాల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన పెరుగుతోందన్నారు.

### హామీల అమలు బాధ్యత ప్రభుత్వానిదే

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. పేదల ప్రయోజనాలను కాపాడేలా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, లబ్ధిదారుల సందేహాలకు సమాధానం చెప్పాలని ఆయన కోరారు. ఈ అంశంపై ప్రజా వేదికల్లో చర్చకు సిద్ధమని ప్రకటించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. ప్రభుత్వం తన వద్ద ఉన్న పూర్తి సమాచారాన్ని ప్రజల ముందుంచాలని సవాల్ విసిరారు. పేదల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# కాళేశ్వరం నుంచి యూనిటీ మాల్ వరకు సీబీఐ విచారణ జరపాలి

వినియోగం, తుది చెల్లింపుల వరకు మొత్తం వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగితేనే నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రానికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. కాళేశ్వరం అంశంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లేఖ పంపితే తాను స్వయంగా కేంద్ర హోంమంత్రిని కలిసి విచారణ వేగవంతం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజాధనం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.202 కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమితో చేపట్టనున్న యూనిటీ మాల్ ప్రాజెక్టుపై కూడా ఆరోపణలు వస్తున్నాయని ఎంపీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను కూడా సీరియస్‌గా తీసుకుని విచారణ జరపాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలపై విచారణలు జరిగినప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధించిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరగకూడదనే కారణం ఏంటని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన 10 ఎకరాల భూకేటాయింపు వ్యవహారంతో పాటు ప్రస్తుతం యూనిటీ మాల్‌కు సంబంధించిన ఒప్పందాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు రఘునందన్ రావు వెల్లడించారు. ప్రభుత్వ భూములు, ప్రజా వనరులకు సంబంధించిన ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాలని, అనుమానాలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన ఆస్తుల విషయంలో జవాబుదారీతనం తప్పనిసరి అని అన్నారు.

హైదరాబాద్‌లో ఎకరం భూమి విలువ వందల కోట్ల రూపాయలకు చేరిందని, అలాంటి విలువైన ప్రజా ఆస్తులను విక్రయించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని ఎంపీ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ప్రజా ఆస్తులకు యజమానులు కాదని, కేవలం వాటి సంరక్షకులుగా మాత్రమే వ్యవహరించాలని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజా ఆస్తుల విషయంలో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని రఘునందన్ రావు తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి విషయంలో ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి రెండు వైపులా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు మారుస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు ముగింపు పలకాలంటే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## జంక్ ఫుడ్‌పై సుప్రీం హెచ్చరిక

పడే అవకాశం ఉందని ఆయన వాదించారు. అయితే ఈ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేస్తూ ఆరోగ్యపరమైన ప్రమాదాల విషయంలో రాజీ ఉండకూడదని పేర్కొంది.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇప్పటికే ఆహార ఉత్పత్తులపై ముందు భాగంలో హెచ్చరిక గుర్తులు తప్పనిసరి చేశాయి. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఉత్పత్తులను వినియోగదారులు సులభంగా గుర్తించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. భారతదేశంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్ గత కొంతకాలంగా వినిపిస్తోంది. ప్రజారోగ్య సంస్థలు, వైద్య నిపుణులు కూడా దీనికి మద్దతు తెలుపుతున్నారు. రెండు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ గడువులోగా నిర్ణయం రాకపోతే తదుపరి విచారణలో తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. దేశంలో పెరుగుతున్న ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి సమస్యల నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల ఆరోగ్య హక్కుల పరిరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 14 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి సిఐటియు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 13 తరంగాలు**
వివిధ రంగాల్లో పనిచేస్తున్న మార్కెట్ అమాలీలు బజార్ అమాలీలు గ్రామీణామాలు కు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హమాలీలకు సంక్షేమ ఏర్పాటు చేయాలని అమాలి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న అమలు చేయడం లేదని విమర్శించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు కూడా పెంచడం లేదని వారికి భద్రత సౌకర్యం కల్పించడం లేదని ప్రమాదాలకు గురైతా ఉన్నారు వారిని పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టో విషయాన్ని వెంటనే అమలు చేసి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా 55 సంవత్సరాలు నిండిన అమాలి కార్మికులకు 6000 రూపాయల వృద్ధాప్యపెన్షన్ ఇవ్వాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో అమాలి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జర్నీ జంగయ్య బుడిగ వెంకటేశం గాడి పెల్లి నరసింహ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు డీఏలను ఆపడం అన్యాయం

- **ఉపాధ్యాయ సంఘాల ఆవేదన**



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 13,(తరంగాలు):** రాష్ట్రంలో ఉద్యోగ–ఉపాధ్యాయులకు రావాల్సిన ఆరు డీఏలను ప్రభుత్వం మంజూరీ చేయకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్ పీసీ) నేతలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతీపత్రంను గురువారం భోజన విరామ సమయంలో మండల తహశీల్దార్ శ్రీనివాస్ కు అందచేసారు.అనంతరం యూఎస్ పీసీ నేతలు మెంతుల శ్రీనివాస్ ,వనపర్తి వేణుగోపాల్ మాట్లాడుచూ తమ డిమాండ్ల సాధన కోసం యూఎస్ పీసీ దశల వారిగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలుపుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపుతూ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆరు డీఏలను మంజూరీ చేయడం లేదన్నారు. గతంలో ఇలా ఎన్నడు ఇంత పెద్ద ఎత్తున డీఏలు పెండింగ్ లో లేవన్నారు.2023 జులై నెల నుండి అమలు కావాల్సిన పీఆర్సీని సైతం పెండింగ్ లో ఉంచడం తగదన్నారు.ఇటీవల కాలంలో నియమితులైన 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఏడాదికి 12 నెలల వేతనాన్ని ఇవ్వాలని,విద్యారంగానికి సంబంధించిన వారినే డీఈఓలుగా నియమించాలని, పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలనే తదితర డిమాండ్లతో తహశీల్దార్ కు వినతీపత్రంను సమర్పించినట్లు వారు తెలిపారు.తమ న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం నెరవేర్చకపోతే ఆందోళనా కార్యక్రమాలను ఉద్ధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు అంచూరి సురేష్ ,వంగ నాగరాజు,పబ్బా వేణు,సిహెచ్నాగరాజం,గిరిబాబు,కందుల.శ్రీనివాస్ ,ఎం.రమేష్ ,జి.విజయ, ఎన్ ,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించిన సర్పంచ్ మోహన్ రావు



**జఫర్గడ్ (ప్రతినిధి, ఆగస్టు 13,(తరంగాలు):** రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కుంభం సంపత్ చిరు వ్యాపారి బుధవారం ఉదయం మహబూబాద్ లో బైక్ యాక్సిడెంట్ జరిగిన విషయాన్ని తెలుసుకొని హనుమకొండ హాస్పిటల్కు పరామర్శించడానికి వెళ్లిన మేజ గ్రామపంచాయతీ సర్పంచ్ మోహన్ రావు, వార్డు సభ్యులు ఇల్లందుల ప్రవంతి మొగిలి,,తాటికాయల నర్సింగ్ , తదితరులు పరామర్శించారు.

# బునాదిగాని కాలువ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కుంభం





**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 13 తరంగాలు**
భువనగిరి నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ బునాదిగాని కాలువపై చేపట్టిన కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తికావడంతో, బీబీనగర్ మండలం మక్త అనంతారం వద్ద బునాదిగాని కాలువ నీటిని భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విడుదల చేశారు.బునాదిగాని కాలువపై బాక్స్ కల్వర్టుల నిర్మాణం పూర్తికావడంతో కాలువలో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు తొలగి, నీటిని సాఫీగా తరలించేందుకు మార్గం సుగమమైంది. దీంతో కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి విషయంలో మరింత ప్రయోజనం చేకూరనుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలువల అభివృద్ధి, ఆధునీకరణ, అవసరమైన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు.బునాదిగాని కాలువ పరిధిలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇందులో భాగంగానే కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తి చేసి, కాలువ నీటిని విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.కాలువ ద్వారా విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే గారు సూచించారు. నీటి ప్రవాహంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ నియోజకవర్గ అభివృద్ధికి ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, కాలువల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్, సీనియర్ నాయకులు పంజాల రామాంజనేయులు,గోలి పింగల్ రెడ్డి,నరేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్,పిఏసిఎస్ డైరెక్టర్లు, మండల నాయకులు,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,రైతులు,,ఈ ఈ శైలేందర్,డి ఈ లావణ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలే మేలు

- **తక్కువ నీటితో ఆరుతడి పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి :**

**కలెక్టర్ అంకిత్**




**సుజాతనగర్, తరంగాలు న్యూస్ ఆగస్టు 13:**
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. వరికి బదులుగా పెసర, కూరగాయలు, ఇతర ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. సుజాతనగర్ మండలం సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు.సింగభూపాలెం చెరువును పరిశీలించిన కలెక్టర్ నీటి నిల్వల పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, పెసర, పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం

సింగభూపాలెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కోసం జరుగుతున్న సర్వేను పరిశీలించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నిబంధనల మేరకు ఇల్లు అందేలా పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ సంప్ పనులను పరిశీలించి ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.


### నెల రోజుల్లో విద్యార్థుల్లో పురోగతి కనిపించాలి

జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ పఠన సామర్థ్యాలను పరిశీలించారు. నెల రోజుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి కనిపించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వేపలగడ్డ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, మెరుగైన సౌకర్యాలు అందించాలని సూచించారు.ఈ పర్యటనలో వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం, అపహరణ కేసులో నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- **రూ.7,000 జరిమానా.. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం**

**నల్గొండ– ఆగస్టు13,తరంగాలు :**
మైనర్ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి నల్గొండ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7,000 జరిమానా విధించిందని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు.2020 సంవత్సరంలో మిర్యాలగూడ ×× టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి క్రైమ్ పోస్కో చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేశారు.ఈ కేసులో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన మహమ్మద్ జాఖీర్ బాబా, వయస్సు 20 సంవత్సరాలు, నిందితుడిగా ఉన్నాడు. కేసును దర్యాప్తు చేసి నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించి, నిందితుడిపై న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేయగా అనంతరం కేసు విచారణలో ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని ఐపీసీ సెక్షన్ 366 మరియు పోక్సో చట్టం సెక్షన్ 3  & 4 కింద దోషిగా నిర్ధారించింది. ఐపీసీ సెక్షన్ 366 కింద నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.అదేవిధంగా పోక్స్ చట్టం సెక్షన్ 3 & 4 కింద 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఫోక్స్ చట్టంలోని సెక్షన్ 42 ప్రకారం ఐపీసీ మరియు ఫోక్స్ చట్టాల కింద వర్తించే శిక్షల్లో అధికమైన శిక్షను అమలు చేయాల్సి ఉండటంతో, అత్యాచారం నేరానికి పొక్స్ చట్టం కింద విధించిన శిక్షను అమలు చేయాలని కోర్టు నిర్ణయించింది.అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు కానున్నాయి. దీంతో ఐపీసీ సెక్షన్ 366 కింద 5 సంవత్సరాలు, పొక్స్ చట్టం కింద 20 సంవత్సరాలు విధించబడినప్పటికీ, కోర్టు ఆదేశాల ప్రకారం



శిక్షలు ఏకకాలంలో అమలు అవుతాయి. మొత్తం జరిమానా రూ.7,000 అదేవిధంగా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందజేయాలని కోర్టు ఆదేశించింది.ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించిన అప్పటి మిర్యాలగూడ–××(టీ ) పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డి. శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్,కేసును న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదించిన వేముల రంజిత్ కుమార్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జె. సోమ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్,కోర్టు డ్యూటీ విధుల్లో సమన్వయంతో పనిచేసిన డి.సి.ఆర్.బి సీఐ శ్రీను నాయక్,సిడిఓ బుర్రి అఖిల్,డి. రాగ్యా నాయక్, లైజన్ అధికారులు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు అభినందించారు.ఈ సందర్భంగా జిల ఎస్పీ గారు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వ్యక్తులపై నల్గొండ జిల్లా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా దర్యాప్తు మరియు ప్రాసిక్యూషన్ ప్రక్రియలను సమర్థవంతంగా కొనసాగిస్తామని తెలిపారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శుక్రవారం, 14 ఆగస్టు , 2026


# ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి





- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 13,తరంగాలు** : గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌లోని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు.గురువారం మున్సిపాలిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, వివిధ శాఖల అధికారులు, కాలనీ అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 14వ డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు.కాలనీల్లో తాగునీటి సమస్య, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థపై కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో పాటు స్మశాన వాటికల వద్ద నీటి సరఫరా కల్పించాలని ఆదేశించారు.
ప్రజా సమస్యల పరిష్కారంలో వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. ఈ సమావేశంలో 14వ డివిజన్ అధ్యక్షులు ఇంతియాజ్, వివిధ కాలనీల అధ్యక్షులు, మున్సిపల్ అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# తండ్రి జ్ఞాపకాల్లో సేవా స్ఫూర్తి

- పుల్లయ్య ఆశయాలకు వారసుడిగాసేవా బాటలో గుజ్జ వీరన్న
- వార్డు బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆప్యాయ కానుక
- ఘనంగా గుజ్జ పుల్లయ్య 11వ వర్ధంతి వేడుకలు



బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి తన తండ్రి చిత్రపటానికి నివాళులర్పించిన గుజ్జ వీరన్న

వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 13,తరంగాలు :వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన మూడవ వార్డు కౌన్సిలర్ గుజ్జ వీరన్న తండ్రి గుజ్జ పుల్లయ్య 11వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.తండ్రి ఆశయాలకు వారసుడిగా గుజ్జ వీరన్న.. సేవా బాటలో తన తండ్రి జ్ఞాపకార్థం వార్డు బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆప్యాయ కానుకగా నూతన వస్త్రాలు అందజేశారు.గురువారం గుజ్జ పుల్లయ్య 11వ వర్ధంతిని పురస్కరించుకుని 3వ కౌన్సిలర్ గుజ్జ వీరన్న ముందుగా తన తండ్రి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి చూపిన స్ఫూర్తి, ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తండ్రి జ్ఞాపకార్థం వార్డు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటారని గుజ్జ వీరన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ,మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఎస్సైని సన్మానించిన వెలువర్తి యూత్ అసోసియేషన్ సభ్యులు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 13 తరంగాలు** వలిగొండ పోలీస్ స్టేషన్ గురువారం నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించిన వెలువర్తి యూత్ అసోసియేషన్ సభ్యులు. ఈ సందర్భంగా వెలువర్తి గ్రామంలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి రావాల్సిందిగా నూతన ఎస్సైని కోరారు. ఈ కార్యక్రమంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద రాజు, మల్లం నరేష్, ప్రధాన కార్యదర్శి కూచిమల్ల నాగేష్,బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి,కలుకూరి విక్రమ్, కలుకూరి మహేష్,కూచిమల్ల నాగేంద్రప్రసాద్, ఎడవల్లి గణేష్,చేగూరి మత్స్యగిరి, ఎర్రం సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# గోపి చెరువులో నీళ్లు నిల్.. రైతు పొలాల్లో కన్నీళ్లు ఫుల్..!

- 300 ఎకరాల్లో పంట జాడేది?
- రైతుల గోడు పట్టించుకునేదెవరు?
- నవాబుపేట రిజర్వాయర్ నుంచి వెంటనే నీరు విడుదల చేయాలి
- రైతు సంక్షేమం మాటల్లో కాదు.. పొలాల్లో నీళ్లతో చూపించాలి
- రైతు పొలంలో నీరు లేకపోతే అది రైతు తప్పు కాదు.. ప్రభుత్వ వైఫల్యం
- నవాబుపేట రిజర్వాయర్ నుంచి వెంటనే నీటిని విడుదల రైతులను ఆదుకోవాలి
- రైతుల పట్ల ఇదే నిర్లక్ష్యం కొనసాగితే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



జనగామ ప్రతినిధి , ఆగస్టు 13, తరంగాలు : గోపి చెరువులో నీళ్లు లేవు.. వరి నాట్లు లేవు.. రైతుల కళ్లలో కన్నీళ్లు మిగిలాయి” అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని చిన్నమడూర్‌లో గోపి చెరువు ఆయకట్టు కింద ఉన్న సుమారు 300 ఎకరాల పొలాలు పంటలు లేక వెలవెలబోతున్న పరిస్థితిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరిశీలించారు. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పొలాలు ఎండిన నేలలుగా, బీడు భూములుగా మారడంపై రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఎన్నడూ లేని దుస్థితి ప్రస్తుతం నెలకొందని, కాంగ్రెస్ పాలనలో రైతులు పంటలు వేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.“వ్యవసాయం తప్ప మాకు మరో ఆధారం లేదు.. నీళ్లు ఇచ్చి మా పంటలను కాపాడండి” అంటూ రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రిజర్వాయర్లలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతుల పొలాలకు ఎందుకు నీరు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా నవాబుపేట రిజర్వాయర్‌ను నింపి చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీరు అందించామని ఆయన గుర్తు చేశారు. నీటిని అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం రైతులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.“రైతు సంక్షేమం మాటల్లో కాదు.. పొలాల్లో నీళ్లతో చూపించాలి. రైతు పొలంలో నీరు లేకపోతే అది రైతు తప్పు కాదు.. ప్రభుత్వ వైఫల్యం” అని ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు.నవాబుపేట రిజర్వాయర్ నుంచి వెంటనే నీటిని విడుదల చేసి 300 ఎకరాల రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పట్ల ఇదే నిర్లక్ష్యం కొనసాగితే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. “రైతు కన్నీటికి సమాధానం చెప్పాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వమే” అని ఎర్రబెల్లి దయాకర్‌రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు.



# వరి వేసుకోకండి .నష్టపోకండి- జిల్లా కలెక్టర్

## బి. చంద్రశేఖర్ రైతులకు విజ్ఞప్తి



**నల్గొండ- ఆగస్టు13, తరంగాలు :**
ఈ ఖరీఫ్ సీజన్ సమయం ముగిసినందున జిల్లాలోని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయవద్దని, వరి వేస్తే నష్టపోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. వ్యవసాయ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి రైతులు వరి వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. వరి పంట వేసేందుకు పెట్టే పెట్టుబడి, నీటి లభ్యత, వర్షాలు, భూగర్భ జలాలు, కూలీల పెట్టుబడి అన్నింటిని రైతులకు వివరించి చెప్పి వరి పంట జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రం శివారులో వరి సాగుకు భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు మోహన్, పరశురాం, ఖాదర్ తదితరులతో మాట్లాడారు. వరి పంటకు సాగునీటి అవకాశాలే లేవని, అలాంటప్పుడు వరి ఎందుకు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. బలవంతంగా వరి సాగు చేస్తే నష్ట పోవలసి వస్తుందని రైతులతో చెప్పారు. ఆరతడి పంటలు వేసుకుంటే నష్టం లేకుండా, ఆదాయం వస్తుందని తెలియజేస్తూఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు కురిసే అవకాశం లేదని, వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేనందున ప్రస్తుతం వరి వేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని, అంతేకాక ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు వచ్చే అవకాశం లేదని, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు రాదని, వర్షం లేకపోవడం, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు తగ్గిపోయిందని తెలిపారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి పంట వేసుకోవద్దని, అనవసరంగా ఇబ్బందులు పడవద్దని అన్నారు. వరి పంట వేసుకున్నట్లయితే మధ్యలోనే పంట ఎండిపోతుందని, ఇదివరకే చాలా చోట్ల బోర్లలో తక్కువ నీరు వస్తున్నదని,వరి పైన పెట్టిన పెట్టుబడి కూడా రైతుకు గిట్టుబాటు కాదని ,వరి పంట స్థానంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని, సెప్టెంబర్ చివరివరకే ఆరుతడి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రం శివారులో చౌడు భూముల్లో రైతులు వరి పంటకు సిద్ధం చేయడాన్ని గమనించిన కలెక్టర్ చౌడు భూముల్లో మినుములు, పెసర వంటి పంటలు వేసుకోవాలని, మినుము, పెసర పంటలకు పెట్టుబడి తక్కువని, ఎకరాకు 8000 చొప్పున ఆదాయం వస్తుందని, అదే వరి పంటకు పెట్టుబడి ఎక్కువని, పొరపాటున నీళ్లు లేక, వర్షం రాక పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతు అప్పుల పాలు కావాల్సి వస్తుందని అన్నారు. చవుడు భూములలో జిప్సం వేసుకున్నట్లయితే మినుము, పెసర పంటల లాంటివి సులభంగా తీసుకోవచ్చని, అంతేకాక చౌడు నెలల్లో రేగు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు కూడా వేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ దిశగా రైతులు ఆలోచించి ఆరుతడి పంటలు ,ఉద్యాన పంటలు వేసుకునేలా చూడాల్సిందిగా ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారులు వారి పరిధిలోని ప్రతి రైతు ను ప్రత్యక్షంగా కలిసి పంట వివరాలను తెలుసుకొని వరి పంట సాగు చేయవద్దని, వరి పంట సాగు చేయడం వల్ల కలిగే నష్టాలను లెక్కలతో సహా వివరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. రైతులు యూరియా గురించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ అన్ని షాపులలో యూరియా దొరికే విధంగా అవకాశం కల్పించాలని, యాప్ ద్వారా యూరియా బుక్ చేయడం వల్ల వెంటనే స్టాకు అయిపోతున్నదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ యూరియా ఇండెంట్ పంపాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ను ఆదేశించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, సన్నీ రాజ్, గిరిరాజు ,ఏవో శ్రీనివాస్, ఏ ఈ ఓ సంతోషి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.
జారీ చేసిన వారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.

# రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం






- గ్రామ కమిటీలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాదులు
- గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి
- ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్‌గౌడ్

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 13, తరంగాలు** :రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఐనవోలు మండలంలోని పంతిని, కక్కిరాలపల్లి, పున్నేలు, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీలను గురువారం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్‌గౌడ్, కమిటీ ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నకరకంటి మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి గ్రామస్థాయి నుంచి బలమైన మద్దతు అవసరమన్నారు. గ్రామ కమిటీలే పార్టీకి బలమైన పునాదులని, గ్రామ శాఖలు చురుగ్గా పనిచేసి మండల, జిల్లా స్థాయికి బలమైన నాయకత్వాన్ని అందించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమిటీ ఇన్‌చార్జీలు తెల్ల సుగుణ, కిషోర్, నాగరాజు, హనుమకొండ జిల్లా డిజిటల్ మీడియా ఇన్‌చార్జి రాయపురం సాంబయ్య, జిల్లా జేబీఎం అధ్యక్షులు జన్నపురెడ్డి ఋగ్వేద్‌రెడ్డి, ఐనవోలు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పోలపల్లి శివశంకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు పూస చిరంజీవిరెడ్డి, మహమ్మద్ రఫీ, కిసాన్ సెల్ అధ్యక్షులు గ్యాదరీ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు బొమ్మినేని రాకేష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు రావుల రవీందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి సుధీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరయ్యారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - పర్వతగిరి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు



**పర్వతగిరి,తరంగాలు(ఆగస్టు 13):** పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలం లోని వివిధ పాఠశాలలలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 58,ఆదర్శ పాఠశాలలో 67,సాంఘిక సంక్షేమ పాఠశాలలో 110,గిరిజన సంక్షేమ పాఠశాలలో 35 మంది వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న విద్యార్థినులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి,మందులు అందజేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం,శుభ్రమైన ఆహారం మరియు నీటిని తీసుకోవడం,సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి ఆరోగ్య అవగాహన కల్పించడం జరిగింది.విద్యార్థినులు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించడం జరిగింది.ఈశిబిరాలలోవైద్యులు ఉదయరాజ్,రమ,మానస,ఝాన్సి,రాణి,యశస్వినీ,హెల్త్ సూపర్వైజర్ వసంత, ఏఎన్ఎం లు సామ్రాజ్యం,రజిత, హేమలత,శ్రీలత, దేవకుమారి,ఆశ కార్యకర్తలు,పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

### నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష



నల్గొండ, ఆగస్టు 13 (తరంగాలు): మైనర్ బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి నల్గొండ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందజేయాలని కోర్టు ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు.2020లో మిర్యాలగూడ-టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 366తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 3, 4 కింద కేసు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన మహమ్మద్ జాఖీర్ బాబా నిందితుడిగా ఉన్నాడు.పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి ఆధారాలను సేకరించి నిందితుడిపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది.ఐపీసీ సెక్షన్ 366 కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా, పోక్సో చట్టం సెక్షన్ 3, 4 కింద 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. శిక్షలు ఏకకాలంలో అమలు కానున్నందున ప్రధానంగా పోక్సో చట్టం కింద విధించిన 20 ఏళ్ల శిక్ష అమలవుతుంది. మొత్తం జరిమానా రూ.7 వేలు.కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్, కోర్టు డ్యూటీల్లో సమన్వయంతో పనిచేసిన అప్పటి మిర్యాలగూడ-టూ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ డి. శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్, ఇన్‌స్పెక్టర్ జె. సోమ నర్సయ్య, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, సీడీఓ బుర్రి అఖిల్, డి. రాగ్యా నాయక్, లైజన్ అధికారులు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్‌లను ఎస్పీ అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వ్యక్తులపై నల్గొండ జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా దర్యాప్తు, ప్రాసిక్యూషన్ ప్రక్రియలను సమర్థవంతంగా కొనసాగిస్తామని తెలిపారు.

# నూతనంగా నియమితులైన జనగామ జిల్లా అధ్యక్షులకు ఘన సన్మానం



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 13,(తరంగాలు)**: జనగామ జిల్లా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ జావిద్ నూతనంగా నియమితులైన సందర్భంగా వరంగల్ సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు కాట కుమారస్వామి ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మహమ్మద్ జావిద్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కాట కుమారస్వామి స్వగృహానికి వెళ్లారు.నూతనంగా జనగామ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మహమ్మద్ జావిద్‌ను కాట కుమారస్వామి ఆత్మీయంగా అభినందించి,శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కాట కుమారస్వామి మాట్లాడుతూ..జనగామ జిల్లా గత ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియా సోషల్ మీడియాలో రాణిస్తూ ఉన్న జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్,జాతీయ అధ్యక్షులు ఏటి ఆంజనేయులు ఉపాధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, ఈ బాధ్యతలు సమర్ధుడు అని పూర్తి బాధ్యతలు జనగంఅధ్యక్షులుగా మహమ్మద్ జావిద్‌కు నూతన బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పిస్తూ,ప్రజా సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గంలో కృషి చేయాలని ఆకాంక్షించారు.మహమ్మద్ జావిద్ మాట్లాడుతూ తనను జనగామ జిల్లా అధ్యక్షులుగా నియమించిన కమిటీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ,సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా పొందేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగకరమని,ఈ చట్టం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న హక్కులు,అవకాశాలపై గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జనగామ జిల్లాలో కమిటీని బలోపేతం చేస్తూ,ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని మహమ్మద్ జావిద్ తెలిపారు.ఈ సందర్భంగా కాట కుమారస్వామి,మహమ్మద్ జావిద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.కాట కుమారస్వామి స్వగృహంలో జరిగిన ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.నూతనంగా నియమితులైన జనగామ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జావిద్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బంజారా గుండెల్లో ‘తీజ్’ సంబరాలు

- తొమ్మిది రోజుల కఠిన నిష్ఠ,భక్తి భావంతో తీజ్ పండుగ



పర్వతగిరి,తరంగాలు(ఆగస్టు 13): భారతీయ సంస్కృతిలో పండుగంటే కేవలం పిండివంటలు, కొత్త బట్టలు మాత్రమే కాదు..ప్రకృతితో మమేకమయ్యే ఒక మహోత్సవం. అందులోనూ గిరిజన జీవన విధానం, వారి ఆచారాలు అడుగడుగునా ప్రకృతి ఆరాధననే చాటుతుంటాయి. బంజారుల (లంబాడీల) ఆత్మబంధానికి, అచ్చమైన సంస్కృతికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన ‘తీజ్’ పండుగ వేడుకలు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దూప తండలో అత్యంత కనుల పండువగా,ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. గిరిజన సాంప్రదాయంలో ‘తీజ్’ కేవలం ఒక పండుగ కాదు, ఇదొక పెద్ద తొమ్మిది రోజుల తపస్సు వలె సాగే తంతు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో ఈ వేడుకలను అత్యంత నిష్టతో నిర్వహిస్తారు.ఈ ఉత్సవాల్లో తండాలోని పెండ్లి కాని యువతులు ప్రధాన కర్తలుగా వ్యవహరిస్తారు.తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పూజా కార్యక్రమంలో భాగంగా.. మొదటి రోజు మొలకల సాగుతో పండుగ ప్రారంభం అవుతుంది. యువతులు స్వచ్ఛమైన మట్టిని సేకరించి, వెదురు బుట్టల్లో నవధాన్యాలను (ముఖ్యంగా గోధుమలను) విత్తుతారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నిష్టతో నీరు పోస్తూ, ఆ మొలకలు (తీజ్) పచ్చగా ఎదిగేలా కంటికి రెప్పలా కాపాడుకుంటారు.ఈ తొమ్మిది రోజులూ తండాలోని యువతులు ఉపవాసాలు ఉంటూ, సేవ్‌లాల్ మహారాజ్‌ను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు.ఈ పండుగలో కంక బుట్టలకు ముఖ్యమైన ప్రత్యేకత ఉంటుంది.పెళ్లికాని యువతుల ఆకాంక్షలకు అనుగుణంగా తీజ్ ఉత్సవంలో ఏర్పాటు చేసే కంక బుట్టల సంఖ్య తండాలోని,అలాగే పండుగకు హాజరయ్యే బంధువుల పెళ్లికాని ఆడపడుచుల సంఖ్యకు సమానంగా ఉంటుంది. ప్రతి కంక బుట్టను ఒక పెళ్లికాని కన్యకు ప్రతిరూపంగా భావిస్తూ ఆమె శుభ భవిష్యత్తు,సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు,బంజారా సమాజ సంక్షేమానికి ప్రతీకగా పూజిస్తారు.తొమ్మిది రోజుల తీజ్ వ్రతాన్ని ఆచరించే పెళ్లికాని ఆడపడుచులు తమకు మంచి జీవిత భాగస్వామి లభించాలని దేవతలను, ప్రకృతిని మనసారా ప్రార్థిస్తూ తొమ్మిది రోజుల పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు.

# దేశ గౌరవం,ఐక్యతకు ప్రతీక "త్రివర్ణ పతాకం"






- హనుమకొండలో మార్మోగిన 'వందేమాతరం' నినాదం!
- బిజెపి హన్మకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండాలు
- హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**హనుమకొండ, ఆగస్టు 13, తరంగాలు** :త్రివర్ణ పతాకం దేశ గౌరవం, ఐక్యతకు ప్రతీక అని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పేర్కొన్నారు. దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా బిజెపి హన్మకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు గురువారం సాయంత్రం భారీ తిరంగా ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మువ్వన్నెల జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య సమరయోధులు, వీర జవాన్ల ధైర్యం, అంకితభావం, దేశసేవ వల్లే నేడు భారత్ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం నూతన ఆత్మవిశ్వాసంతో మరింత బలంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా దేశం నిరంతరం పురోగమిస్తోందని తెలిపారు.దేశ సమగ్రత, సార్వభౌమత్వం, జాతీయ ఐక్యతను కాపాడేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. త్రివర్ణ పతాకాన్ని గర్వంగా చేతబట్టడంతో పాటు దాని స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ నిత్యం హృదయాల్లో నిలుపుకోవాలని కోరారు. మరింత శక్తివంతమైన, సుసంపన్నమైన, ఆత్మనిర్భర భారతాన్ని నిర్మిస్తూ 'వికసిత్ భారత్' సాధించడమే మనందరి సమష్టి సంకల్పం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావు పద్మారెడ్డి, డా. పగడాల కాళీప్రసాద్ రావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డా. పెసరు విజయ్ చందర్ రెడ్డి, పులి సరోతం రెడ్డి, మాజీ కార్పొరేటర్లు చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, రావుల కోమల కిషన్, గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పి. జయంత్ లాల్, దేవనూరి మేఘనాథ్‌తో పాటు జిల్లా నాయకులు, వివిధ డివిజన్, మండల అధ్యక్షులు, విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తూరు మత్స్య సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా భీమని అనిల్ ఎన్నిక
- మత్స్యకారుల సంక్షేమం, సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం - నూతన కమిటీ



**రాయపర్తి, ఆగస్టు 13 తరంగాలు:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక గురువారం స్థానిక సహకార సంఘం కమిటీ భవనంలో నిర్వహించారు. జిల్లా మత్స్య సహకార శాఖ ఎలక్షన్ అధికారులు సందీప్, కృష్ణవేణి, అఫ్జల్ ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా భీమని అనిల్, ఉపాధ్యక్షుడిగా భీమని రమేష్, కార్యదర్శిగా సంధిరి సాంబయ్య, కోశాధికారిగా కొండ రాజు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా సింగారబోయిన ఉప్పలయ్య, సింగారబోయిన వెంకన్న, భీమని కృష్ణ, భీమని యాదగిరి, పాక మనీష్ విజయం సాధించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం, సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. మత్స్యకారులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం




వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 13,తరంగాలు : భారత ప్రభుత్వం పిలుపు మేరకు, జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ ఆదేశాల మేరకు మై భారత్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యువత, విద్యార్థులకు 300కు పైగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు జాతీయ జెండాపై గౌరవాన్ని మరింతగా పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మై భారత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండ సురేష్ తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాలను స్వీకరించారు.

# పీఆర్‌టీయు మండల అధ్యక్షుడిగా భూక్య రాములు ఏకగ్రీవ ఎన్నిక





**పర్వతగిరి, ఆగస్టు 13(తరంగాలు):** మండలంలోని ఏనుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు భూక్య రాములు అధ్యక్షతన పీఆర్‌టీయు టీఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం పోరాడుతుందని,సెప్టెంబర్ 1న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి పర్వతగిరి మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పీఆర్‌టీయూ టీఎస్ పర్వతగిరి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయు పర్వతగిరి మండల శాఖ అధ్యక్షుడిగా భూక్య రాములు వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రధాన కార్యదర్శిగా మేడిది నాగేశ్వర రావు,అసోసియేట్ అధ్యక్షులుగా సాంబారి అనిల్‌కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఆర్. కల్పన, ఉపాధ్యక్షులుగా కే. దామోదర్‌రెడ్డి, ఎం. రమేష్, మహిళా ఉపాధ్యక్షులుగా వై. రాణి రుద్రమదేవి, కె. శ్వేత,కార్యదర్శులుగా ఆర్. రాజు, జి. రాజు, మహిళా కార్యదర్శులుగా కే. లలితాదేవి,ఎన్. ప్రశాంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా గీసుకొండ మండల జనరల్ సెక్రెటరీ మార్త శ్రీను, దుగ్గొండి మండల అధ్యక్షుడు పొగాకు అచ్చయ్య, నల్లబెల్లి మండల ప్రధాన కార్యదర్శి బానోతు కృష్ణ వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో మాజీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎన్వీఆర్ రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొనుగోటి అశోక్‌రావు, ధీకొండ నరసింహారావు,బిల్లిపెల్లి లక్ష్మారెడ్డి,జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కటకం రఘుతో పాటు జిల్లా,మండల బాధ్యులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ రత్న విద్యాలయంలో నమూనా ఎన్నికలులి

- స్కూల్ లీడర్లుగా దివ్య, లక్క రాజేష్




**సంగెం ఆగస్టు 13 తరంగాలు** మండలంలోని మొండ్రాయి గ్రామంలోని శ్రీ రత్న విద్యాలయంలో మాక్ ఎలక్షన్ మరియు స్కూల్ లీడర్ ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించే ఉద్దేశంతో ఈ ఎన్నికలను నిర్వహించారు.ఈ ఎన్నికల్లో అమ్మాయిల విభాగం స్కూల్ లీడర్‌గా దివ్య విజయం సాధించగా, అబ్బాయిల విభాగంలో లక్క రాజేష్ విజయం సాధించారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మచ్చిక వెంకటేశ్వర్లు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా విజేతలను శ్రీ రత్న విద్యాలయం కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మచ్చిక వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ వనజ, ఉపాధ్యాయినులు మంజుల, సునీత, రమ్యశ్రీ, ప్రవళిక, రవళి అభినందించారు.విద్యార్థులు ఎన్నికల ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొనడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావన, ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందుతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

## గొర్రె కుంటలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ

**సంగెం ఆగస్టు 13 తరంగాలు**

గ్రేటర్ వరంగల్ 15 వ డివిజన్ గొర్రెకుంట లో బిజెపి డివిజన్ అధ్యక్షులు ల్యాదల్ల ప్రభాకర్ అధ్యక్షతన హర్ ఘర్ తిరంగ ప్రిపరేటరీ మీటింగ్ ఉదయం 10-30 గంటలకు నిర్వహించి డివిజన్ లో హర్ ఘర్ తిరంగ ర్యాలీ అంగ రంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనకి ముఖ్య అతిథిగా బిజెపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త తమ ఇంటి పై జాతీయ జెండా ఎగరవేయాలని అన్నారు.బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు గురువారం హన్మకొండ జిల్లా ఆధ్వర్యంలో జరగపోయే హర్ ఘర్ తిరంగ ర్యాలీ లో 15 వ డివిజన్ నుండు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలోబీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బిల్లా రమేష్, జిల్లా నాయకులు కమగోని రఘుపతి,ఎస్ సి మోర్చా జిల్లా కార్యదర్శి బందేల రేణుక డివిజన్ ప్రధాన కార్యదర్శి గుండబోయిన రంజిత్, డివిజన్ నాయకులు పాలకుర్తి రాజేష్,పిల్లల రవీందర్, జెల్ల నాగరాజు, డిగాయి మహేష్,నరేడ్ల రాములు,కొట్టే భవాని,కొట్టే ప్రశాంత్,కార్యకర్తలు



కోర్నెల్,లలిత లక్ష్మారెడ్డి పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జులు,బిజెపి పార్టీ సానుభూతి నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక

తరంగాలు

# వందే భారత్ అవార్డుకు జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ ఎంపిక

•నాడు డాక్టరేట్,నంది అవార్డు.. నేడు వందే భారత్ అవార్డు..

•ప్రస్తుతం పీపుల్స్ డైరీ ఖమ్మం ప్రతినిధిగా విధులు



**ఖమ్మం, టౌన్ తరంగాలు న్యూస్ ఆగష్టు 13**

ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ వందే భారత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు.. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ గత 13 సంవత్సరాలుగా వివిధ ఛానెల్స్, పత్రికల్లో, వివిధ హెదాల్లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారు. అనేక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాల ద్వారా వాటిని పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ విధంగా సమాజానికి సేవచేస్తూ సీనియర్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్నందుకు అతని సేవలను గుర్తించి ఈ నెల ఆగష్టు 15వ తేదీన శనివారం రోజున హైదరాబాద్ రవీంద్ర భారతి లోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్ 2వ అంతస్థు లో జరిగే వందే భారత్ అవార్డు పురస్కారం కార్యక్రమంలో ప్రముఖ సినీ గీత రచయిత జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు చేతుల మీదుగా ప్రధానం చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ "పీపుల్స్ డైరీ" దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక సంచలనాత్మక కథనాలను అందించారు. ఎక్కడ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా ఎలాంటి శక్తుల ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా వార్తలు అందించడంలో దిట్ట... జర్నలిజం వృత్తినే శ్వాసగా... నైతిక విలువలను పాటిస్తూ పేదల పక్షాన నిలువడం, అన్యాయాన్ని ఎదురించడం లక్షణం.. అక్రమార్కుల బెదిరింపులకు వెరువకుండా, అక్రమ కేసులకు సైతం భయపడకుండా ఎంచుకున్న దారిలో దూసుకెళ్తూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వందే భారత్ జాతీయ అవార్డు రావడం పట్ల స్థానిక సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతూ సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

# మంత్రి తుమ్మల అరుదైన రికార్డు



•రాజకీయ చరిత్రలోనే అరుదైన ఘట్టం

•ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు 21సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జండా ఆవిష్కరణ

•నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం

•4 ప్రభుత్వాల సాక్షిగా ఒకే గౌరవం

•ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ప్రజాస్వామ్యంలో దేశంలో రాజకీయాల్లో పార్టీలు మారతాయి... ప్రభుత్వాలు మారతాయి... కానీ ఒక నేత పట్ల ప్రజావిశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు! తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షర సత్యం. ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా దక్కుతూ వస్తోంది. ఇప్పటికే 20సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న తుమ్మల, ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇదొక సరికొత్త ఘట్టంగా నిలవనుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయడం ప్రతి నేతకూ లభించే గౌరవం. అలాంటి అరుదైన అవకాశం తుమ్మలకు ఏకంగా 20 సార్లు దక్కడం, ఈనెల 15న 21వ సారి దక్కనుండటం విశేషం.నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న, ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా వ్యవహరించారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, ప్రొహిబిషన్-ఎక్సైజ్, మేజర్-మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా...

రాజకీయ ప్రస్థానంలో తుమ్మల ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సుదీర్ఘ ప్రజాజీవితంలో మంత్రిగా ఉన్న దాదాపు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఘనత ఆయనది. వేర్వేరు రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల మార్పుల మధ్య కూడా ఈ గౌరవం వరుసగా దక్కడం ఆయన సుదీర్ఘ ప్రజాజీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.20 సార్లు జెండా ఆవిష్కరణ.. ఇప్పుడు 21వ సారి 1985 నుంచి 1989 వరకు ఐదుసార్లు, 1995 నుంచి 2003 వరకు తొమ్మిదిసార్లు, 2015 నుంచి 2018 వరకు నాలుగుసార్లు, 2024, 2025 సంవత్సరాల్లో ఒక్కోసారి చొప్పున ఇప్పటివరకు 20 సార్లు తుమ్మల నాగేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 15న 21వసారి ఈ గౌరవం దక్కడం రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం



జిల్లాలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 15న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనకు, తన సొంత ప్రాంతానికి ఆనుకుని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ బాధ్యత దక్కడం విశేషంగా చెప్పుకోవచ్చు.రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం... పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధిగా తన స్థానాన్ని పదిలంగా నిలుపుకుంటూ వస్తున్న తుమ్మల నాగేశ్వరరావు రికార్డు, ఉమ్మడి రాష్ట్ర రాజకీయ చరిత్రలో అరుదైనదిగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. నలుగురు ముఖ్యమంత్రుల పాలనా కాలాల్లో ప్రభుత్వం తరపున జాతీయ పతాకావిష్కరణ చేసిన అనుభవం చాలా తక్కువ మంది నేతలకు మాత్రమే దక్కుతుంది. ఈ కోణంలో చూస్తే, తుమ్మల నాగేశ్వరరావుది నిరాటంకమైన, స్థిరమైన రాజకీయ జీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఇప్పటివరకు తుమ్మల జాతీయ పతాకావిష్కరణ చేసిన సంవత్సరాలు:1985, 1986, 1987, 1988, 1989, 1995, 1996, 1997, 1998, 1999, 2000, 2001, 2002, 2003, 2015, 2016, 2017, 2018, 2024, 2025

# నల్లగొండలో ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలు

•రైతాంగ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చేలా మహాసభలను జయప్రదం చేయాలి

•ఎస్కేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్




**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 13 (తరంగాలు):** నల్లగొండ ప్రాంతీయ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలకు చాటిచెప్పే లక్ష్యంతో నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ పిలుపునిచ్చారు.మహాసభల విజయవంతం కోసం యాదాద్రి భువనగిరి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తీగల సాగర్ మాట్లాడుతూ.. 1936 ఏప్రిల్ 11న లక్నోలో స్థాపించబడిన అఖిల భారత కిసాన్ సభ 90 ఏళ్లుగా రైతాంగ హక్కుల కోసం పోరాడుతోందన్నారు.తెలుగు రాష్ట్రాల్లో పలాసా (1940), విజయవాడ (1944), ఖమ్మం, గుంటూరు (2010)లో నాలుగు జాతీయ మహాసభలు జరిగాయని, ప్రతి మహాసభ రైతాంగ ఉద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 80 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వీర తెలంగాణ పోరాటానికి కేంద్రస్థానమైన నల్లగొండలో 36వ మహాసభ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని తీగల సాగర్ ఆరోపించారు. వాణిజ్య ఒప్పందాల ద్వారా దిగుమతులు పెరిగితే పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, ధాన్యం, పాల ఉత్పత్తుల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సీఐటీయూ జాతీయ కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చారిత్రాత్మక రైతు ఉద్యమం జరిగిందన్నారు. రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కార్మిక వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ.. పండ్లు, కూరగాయలు, పత్తి, మిర్చి తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎరువుల ధరలు తగ్గించాలని, వ్యవసాయ సబ్సిడీలు పెంచాలని, రైతులను రుణ విముక్తులను చేయాలని రైతు సంఘం పోరాడుతోందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు నల్లగొండలో జరిగే ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభ వేదిక కానుందని నాయకులు తెలిపారు. మహాసభ విజయవంతానికి రైతులు, రైతు శ్రేయోభిలాషులు ఆర్థిక, హార్థిక సహకారాలు అందించాలని కోరారు.రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, కల్లూరి మల్లేశం, జల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసచారి, బూర్గు కృష్ణారెడ్డి, కోట రామచంద్రారెడ్డి, కందడి సత్తిరెడ్డి, చీరిక అలివేలు, పైళ్ల యాదిరెడ్డి, చీరిక సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక





వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో రాణి రుద్రమ దేవి ప్రాంగణంలో పోలీస్ అధికారుల సంఘం



కార్యవర్గానికి నిర్వహించిన ఎన్నికల్లో పోలీస్ అధికారులు పోలీస్ అధికారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ అదేశాలతో ఎన్నికల నోడల్ అధికారి అదనపు డిసిపి ప్రభాకర్ రావు,ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డిసిపి శ్రీనివాస్, ఏసిపిలు సదయ్య, నాగయ్యల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నిక సందర్బంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకోని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందు తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ నోడల్, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ రోజు నిర్వహించిన ఎన్నికల్లో 110 వివిధ హోదాలు కలిగిన పోలీస్ అధికారులు తమ ఓ ట ు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో కానిస్టేబుల్ కొండా కరుణాకర్(ధర్మసాగర్ పోలీస్ స్టేషన్), ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.బాబుపై 17 ఓట్ల అధిక్యంతో వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా బి.సతీష్( ఆర్.ఐ), బి.శరత్ కుమర్(ఆర్.ఎస్.ఐ), ప్రధాన కార్యదర్శి గా ఇ.వీరభద్ర రావు (దామెర ఎస్.ఐ),సంయుక్త కార్యదర్శి టి.నరేష్ ( కాజీపేట కానిస్టేబుల్), కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ప్రవీణ్ కుమార్ (ఎ.ఆర్ కానిస్టేబుల్), కోశాధికారి బి.నరేష్ (పాలకుర్తి కానిస్టేబుల్), కార్యనిర్వహక సభ్యులుగా యం. తులసి (మహిళా కానిస్టేబుల్ కాజీపేట), సి.హెచ్ మహెందర్ యాదవ్ (ఎ.ఆర్ కానిస్టేబుల్), ఏ.రమేష్ (ఎ.ఆర్ కానిస్టేబుల్),ఎన్. ప్రవీణ్ (సుబేదారి కానిస్టేబుల్), యం.డి తాజుద్దీన్ (హన్మకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్), పి.సర్వేశ్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికైనారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపిఎస్ వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులకు అభినందనలు తెలియజేసారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము



# రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 13, తరంగాలు :** రోడ్డు దాటుతున్న కూలీని కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలం లోని ఇల్లంద గ్రామానికి చెందిన మహమ్మద్ యాకుబ్ (52), ఖాజామియా కుమారుడు, ప్రతిరోజూ మాదిరిగానే కూలీ పనుల నిమిత్తం వరంగల్‌కు వెళ్లి బుధవారం మధ్యాహ్నం గ్రామానికి తిరిగి వచ్చాడు.మధ్యాహ్నం సుమారు 3.15 గంటల సమయంలో ఇల్లంద మెయిన్ రోడ్డులో బేతి సాంబయ్య ఇంటి సమీపంలో ఆటో దిగి రోడ్డును ఎడమ వైపు నుంచి కుడి వైపునకు దాటుతుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న టీఎస్ 09 ఈకే 0979 నంబర్ గల క్విడ్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాకుబ్ ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో యాకుబ్ మృతి చెందాడు.మృతుడి కుమారుడు మహమ్మద్ జామల్ (26) ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట ఎస్ఐ ఎన్. సాయిబాబు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# అవయవ,దేహదానం అత్యంత పవిత్రమైన సేవ

- కాకతీయ మెడికల్ కాలేజీకి దేహాన్ని అందజేయాలని వెంకటేశ్వర్లు నిర్ణయం మరెందరికో స్ఫూర్తిదాయకం
- వైద్య విద్యార్థుల పరిశోధనలకు దేహదానం ఎంతో ఉపయోగకరం
- సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి
- మరణానంతరం దేహదానం.. సమాజానికి వెంకటేశ్వర్లు ఆదర్శం
- వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించిన బీజేపీ నాయకులు గంట రవికుమార్,ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 13,తరంగాలు** :అవయవ,దేహదానం అత్యంత పవిత్రమైన సేవ అని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు.గురువారం జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 39వ డివిజన్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు సమాజానికి ఆదర్శంగా నిలిచారు. తన మరణానంతరం దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అందజేయాలని నిర్ణయించుకోవడం అభినందనీయమని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు కొనియాడారు.వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మాదాసు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇల్లందుల వెంకటేశ్వర్లును గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరణానంతరం మరొకరికి జీవం పోసే అవయవదానం, వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడే దేహదానం అత్యంత పవిత్రమైనవని అన్నారు. వెంకటేశ్వర్లు తీసుకున్న నిర్ణయం సమాజంలో ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు జీలకర్ర వీరస్వామి, దండు చక్రపాణి, ఇనుముల అజయ్, సగరపు వీరస్వామి, దామెర సదానందం, మాదాసు శ్యామ్, కట్కూరి మణికంఠ, చింత అశోక్, ఎండి గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు

# కౌన్సిలర్ పదవా రేషన్ డీలర్‌షిప్పా.. తేల్చాలి

- చట్ట నిబంధనల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలి
- రెండింటిలో ఏదో ఒకదానినే కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలి
- చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 13,తరంగాలు** : కౌన్సిలర్ పదవా..? రేషన్



డీలర్‌షిప్పా..? తేల్చాలని
వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా కు వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. వర్ధన్నపేట పట్టణంలోని 11వ డివిజన్ కౌన్సిలర్ సిలువేరు కుమారస్వామి గతంలో రేషన్ డీలర్‌గా కొనసాగుతూ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారని, ఎన్నికల నిబంధనల ప్రకారం ఆయన కౌన్సిలర్ పదవిలో కొనసాగాలా, రేషన్ డీలర్‌షిప్‌ను కొనసాగించాలా అనే విషయంపై చట్టపరంగా తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్ మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రేషన్ డీలర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ, ఎన్నికల్లో గెలిచిన అనంతరం రేషన్ డీలర్‌షిప్ లేదా కౌన్సిలర్ పదవిలో ఏదో ఒకదానిని మాత్రమే కొనసాగించేలా నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశంపై అధికారులు చట్టప్రకారం విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కౌన్సిలర్ పదవి నుంచి తొలగించాలని లేదా రేషన్ డీలర్‌షిప్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. సమస్యపై చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కలెక్టర్‌పై తమకు నమ్మకం ఉందని, న్యాయపరంగా తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ సోయల్, భూక్య బాబూలాల్, చిదురాల ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ డైరీ పునరుద్ధరణకు చర్యలు





- పాడి రైతులకు అండగా నిలిచి, పాల ఉత్పత్తిని పెంచాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ

**హనుమకొండ ప్రతినిధి , ఆగస్టు 13, తరంగాలు :** విజయ డైరీ పునరుద్ధరణకు త్వరలోనే చర్యలు చేపడతామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. రైతులు పశుపోషణపై దృష్టి సారించడం ద్వారా వ్యవసాయంతో పాటు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చని, రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పశువులను స్వయంగా ఎంపిక చేసుకోవడం ద్వారా పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.
గురువారం కలెక్టర్ విజయ డైరీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాల సేకరణ కేంద్రం, పాల శీతలీకరణ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, పాలు పరీక్షించే ప్రయోగశాలను పరిశీలించి, అక్కడి కార్యకలాపాలు, పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలు, పాల ఉత్పత్తుల తయారీ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాడి రైతుల సంక్షేమ సంఘం సభ్యులు, రైతులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పశువులను పోషించడం ద్వారా నిరంతర ఆదాయం పొందడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించడంలో భాగస్వాములు కావచ్చని అన్నారు.విజయ డైరీతో పశు సంవర్ధక శాఖను అనుసంధానం చేసి, పాడి రైతులకు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువుల ఎంపిక, పశు వైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులతో త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు.ప్రజలకు మరింత నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించే దిశగా విజయ డైరీ కృషి చేయాలని సూచించారు. ఎలాంటి రసాయనాలు కలపకుండా స్వచ్ఛమైన పాలను అందించేందుకు విజయ డైరీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విజయ డైరీకి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పాలతోపాటు నెయ్యి, పన్నీరు తదితర ఇతర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు, మౌలిక వసతులను సమకూర్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని తెలిపారు. 26 సొసైటీల ద్వారా పాలను సేకరించి, పాలతోపాటు ఇతర పాల ఉత్పత్తులను విజయ డైరీ ద్వారా తయారు చేసి, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నామని వివరించారు.గతంలో విజయ డైరీ ద్వారా నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసి అందించేవారమని, పాల సేకరణ తగ్గిపోవడంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా గణనీయంగా తగ్గిందని తెలిపారు. రైతులు పశుపోషణపై మరింత దృష్టి సారించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.విజయ డైరీ ద్వారా రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని చేరుకునేలా రైతులను పాడి పరిశ్రమ వైపు ప్రోత్సహించేందుకు కార్యాచరణ చేపడుతున్నామని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో కాకతీయ విజయ డైరీ సొసైటీ చైర్మన్ ఎరుపు దేవేందర్, కమిటీ సభ్యులు సమ్మయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి, పాడి రైతులు, డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ఓటరు ఒక్కరూ "జాబితా నుంచి తప్పిపోకూడదు"

- 'అన్‌కలెక్టబుల్' ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పూర్తి వివరాలు ఇవ్వాలి
- కలెక్టర్ సత్య శారదకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ వినతి



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 13, తరంగాలు :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్ ) ప్రక్రియలో ఎన్యూమరేషన్ దశలో సేకరించబడని లేదా అన్‌కలెక్టబుల్గా గుర్తించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పూర్తి వివరాలను అందించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బి ఎల్ ఎ-1 మహమ్మద్ అయూబ్ కోరారు. ఈ మేరకు గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సత్య శారదకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫారమ్ సమర్పించలేదనే కారణంతో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకూడదన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్ వారీగా సేకరించని ఎన్యూమరేషన్ ఫారమ్‌ల జాబితా, వాటిని 'అన్ కలెక్టబుల్ 'గా గుర్తించడానికి గల కారణాలు, నిబంధనలకు లోబడి అందుబాటులో ఉన్న ఓటర్ల సంప్రదింపు వివరాలను అందించాలని ఆయన కోరారు.ఈ వివరాల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు , సమన్వయ బృందాలు క్షేత్రస్థాయిలో సంబంధిత ఓటర్లను గుర్తించి, వారికి అవసరమైన అవగాహన కల్పిస్తాయని తెలిపారు. అలాగే క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్ ప్రక్రియలో తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా సహకారం అందిస్తామని చెప్పారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అనర్హతలు, పొరపాట్లకు తావులేకుండా పారదర్శకమైన, సమగ్ర, ఖచ్చితమైన, లోపరహిత ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు.

# వర్షాభావం వేళ ప్రత్యామ్నాయ పంటలే మేలు




- నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంచుకోవాలి
- రైతులకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 13,తరంగాలు :** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు. గురువారం వర్ధన్నపేట రైతు వేదికలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు.ఇంచార్జి జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా ఉద్యానవన, సెరికల్చర్ అధికారి ఆర్. శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు లేక చెరువుల్లో నీటి చేరిక, బోరుబావుల్లో నీటిమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగును తగ్గించి కంది, పెసర, వేరుశనగ, నువ్వులు, కుసుమ, ఆముదం, జొన్న, రాగి, కొర్రలు, ఉలవలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.కంది, పెసర తదితర పంటల విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. యూరియా, ఇతర ఎరువులు సరిపడా ఉన్నాయని, నానో యూరియా, నానో డీఏపీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయల పంటలను ప్రోత్సహిస్తున్నామని ఉద్యానవన అధికారి తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు కోతుల బెడద ఉండదని, తక్కువ నీటితో సాగు చేయవచ్చని పేర్కొంటూ శాఖ అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ , ఏఈవో లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

